క్లుప్తంగా

8న వేలం పాట

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని పుణ్య క్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవ రాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించి ఈనెల 8న తలనీలాల సేకరణకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కెవి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాటలో పాల్గొనే పాటదారుడు రూ.లక్ష ధరావత్తు చెల్లించాలన్నారు. అలాగే టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకొనుటకు గాను ధరావత్తు రూ.50 వేలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు దరావత్తు రూ.10 వేలు, భక్తులు సమర్పించిన పోగు చేసి నిల్వ ఉంచిన తలనీలాలకు గాను ధరావత్తు రూ.10 వేలు చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు.

ఆర్బీఎస్‌కే కార్యక్రమం పరిశీలన



హెల్త్ క్లీనిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్బీఎస్‌కే పోగ్రాం ఆఫీసర్

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నగురువళూరులోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వచ్ఛ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోగ్రాం ఆఫీసర్ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య వైద్య పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకూ రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను పరిశీలించి, రోగులకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, ఓబులేసు, వాసంతి, సీహెచ్ఓ, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ఆట, పాటల ద్వారా విద్య

రాజుపాళెం : అంగన్‌వాడీ చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యనందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి పేర్కొన్నారు. ఈసీసీఈ డే సందర్భంగా శనివారం మండలంలోని పర్లపాడు గ్రామంలోని 1, 2, 3వ కేంద్రాల్లో తల్లులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ పిల్లలకు కథలు, ఆట, పాటలతో విద్య నేర్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, ఉపాధ్యాయుడు ప్రసాదు, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, రాజమ్మ, వరలక్ష్మి, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా జ్యోతి పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

మైదుకూరు : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ)ప్రచురించిన కొత్త సంవత్సరం 2025 క్యాలెండర్లను శనివారం ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి ప్రభు చైతన్య, మండల పరిషత్ కార్యాలయ ఏఓ నాగేంద్రబాబు, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్, రాష్ట్ర కౌన్సిలర్ కె.పాలకొండయ్య, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సంయుక్త అధ్యక్షులు మల్లేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్, మండల శాఖ అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



కొండూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

అట్లూరు : సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ భాస్కర్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరు బీసీ కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.40 లక్షలతో చేపడుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. అనంతరం తంబళ్లగొంది పంచాయితీలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం సోమేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించారు.

దుష్ప్రచారం నమ్మవద్దు

పోరుమామిళ్ల : కొంతకాలంగా సోషల్ మీడియాలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సమాధులకు సంబంధించి కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని ఎవ్వరూ నమ్మవద్దని కడప జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. జగన్ మోహనాచారి, వెంకట క్రిష్ణమాచారి, కోశాధికారి శ్రీనివాసాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలనరసింహాచారి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ పాలెపు శ్రీనివాసులు తదితరులు అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని స్వామి శిష్యులు, భక్తులు, ప్రజలు నమ్మవద్దన్నారు.

అడుగడుగునా కొత్తపల్లె కాలువ స్థలం ఆక్రమణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో అడుగడుగునా కొత్తపల్లె డ్రైనేజీ కాలువ నిర్మాణం ఆక్రమణకు గురైంది. ఓ వైపు భవన నిర్మాణ యజమానులు, మరో వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడుగడుగునా కాలువను ఆక్రమించడంతో కుంచించుకుపోయింది. కొన్ని చోట్ల కాలువ ఊసే లేకుండా చేశారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి పట్టణంలో ఐదు ప్రధాన మురుగు కాలువలు ఉన్నాయి. వీటిలో కొత్తపల్లె కాలువ నిర్మాణం కూడా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని టూటౌన్ బైపాస్ రోడ్డు నిర్మాణం వరకు ఈ కాలువ నిర్మాణం కనిపిస్తోంది. తర్వాత ఎక్కడపడితే అక్కడ కాలువను ఆక్రమించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద, బస్టాండ్ వెనుక నిర్మిస్తున్న వెంచర్ యజమానులు, తర్వాత మండి బజార్ ప్రాంతంలో కాలువ నిర్మాణం కనిపించలేదు. కేవీఆర్ కాలనీలో కూడా ఇదే పరిస్థితి ఉంది. రోజురోజుకు కాలువ విస్తరణ తగ్గిపోతోంది. దీని వల్ల వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సర్వే చేసి కాలువను పునరుద్దరించాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మురికి కాలువల ఆధునీకరణకు మంజూరైన పనులు రద్దయ్యాయి. భవిష్యత్తులో మళ్లీ నిధులు వచ్చినా నిర్మించడానికి కాలువ కనిపించే పరిస్థితులు లేవు. కాలువలు ఆక్రమణకు గురైనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.



ఆంజనేయస్వామి ఆలయం వద్ద కాలువపై మట్టి కప్పి చదును చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు



ఆంజనేయస్వామి ఆలయం వద్ద కనిపించని కాలువ రూపురేఖలు



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కనిపిస్తున్న కాలువ

11 నుంచి రాయలసీమ సంగీత నృత్యోత్సవం



రాయలసీమ సంగీత నృత్యోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీనటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న రాయలసీమ సంగీత నృత్యోత్సవం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తన గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రాయలసీమ సంగీత నృత్యోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు నాట్యవిశారద మొహిద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ శ్రీకృష్ణగీతాశ్రమంలో 11 నుంచి 13 వరకు రోజు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమి రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, ఎస్వీ సంగీత నృత్యకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జమునారాణి, నాట్య కళాప్రపూర్ణ డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొంటారన్నారు. ఈ వేడుకల్లో కళాభిమానులు, కళాకారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

బలమే జీవితం .. బలహీనమే మరణం



మాట్లాడుతున్న రామకృష్ణమిషన్ స్వామిజీ అనుపమానందజీ మహరాజ్

బద్వేలు అర్బన్ : బలమే జీవితం.. బలహీనమే మరణం అన్న స్వామివివేకానంద ప్రబోధాన్ని నేటి యువత దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని కడప రామకృష్ణమిషన్ స్వామిజీ అనుపమానందజీ మహరాజ్ పేర్కొన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన యువజాగృతి – వివేకానందుని పిలుపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనస్సులో ఉన్న యువత ఈ దేశానికి కావాలని స్వామివివేకానంద కోరుకున్నారని, ఆ దిశగా యువత ఆత్మవిశ్వాసంతో లక్ష్యసాధన దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. ప్రారంభం అతిస్వల్పంగా ఉందని నిరాశ పడకుండా క్రమంగా ఘనమైన ఫలితాలు సాధిస్తామన్న విశ్వాసంతో అడుగులు వేయాలని కోరారు. జీవితంలో ఒక వైఫల్యం కారణంగా చాలా మంది యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇది సరైన నిర్ణయం కాదని, ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే మానవ జీవితానికి సార్థకత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి రాచపూడి వెంకటసాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రామకృష్ణ మిషన్ వలంటీర్ చలపతి, బద్వేలు విభాగం సభ్యులు అమరేంద్రనాథ్, అంకయ్య, శశిధర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలో భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలలో వచ్చిన పిర్యాదులను తక్షణం పరిష్కరించాలన్నారు. రీసర్వే జరిగిన గ్రామ పంచాయతీలలో భూములు అమ్ముకొనేవారు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని పరిష్కరంచే విధంగా తహసీల్దార్ చొరవ చూపాలన్నారు. మండలంలో ఎరువుల కొరత అధికంగా ఉందని అధికారులు తక్షణం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులకు ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆ నిధులను అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాకులు దుర్వినియోగం కాకుండా వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలను తెలుసుకొనేందుకు ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేసిందన్నారు. మండల కేంద్రమైన బి.మఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ కొరత ఉన్నట్లు ఎంపీటీసీలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాతావరణం మార్పుల వల్లే తెగుళ్లు



కందిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కాశినాయన : వాతావరణంలో మార్పుల వల్లనే పంటలకు తెగుళ్ల అధికమయ్యాయని మండల వ్యవసాయాధికారి జయలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామంలో సాగు చేసిన కందిపంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ గుడ్ల నుంచి బయటికి వచ్చి పిల్ల పురుగులను వెంటనే నివారించుకోవాలన్నారు. లేకపోతే దిగుబడిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. కాయతొలుచుపురుగు నివారణకు కొరాజిన్ లీటరు నీటికి 3 ఎంఎల్, 13.0.45 పాస్పేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన పురుగును నివారించుకోవచ్చని పేర్కొన్నారు. శనగపంట పూత, పిందెదశలో ఎక్కువగా పురుగు ఆశించే అవకాశం ఉందని, రైతులు కొరాజిన్, 13.0.45 పాస్పేట్‌ను పిచికారి చేసుకుని నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా జొన్న పంట



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ, వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి

అట్లూరు : సాగు చేసిన జొన్నపంట ఆశా జనకంగా ఉందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలోని కొంగలవీడు గ్రామంలో రైతులు సుమారు 200 ఎకరాలలో మహాలక్ష్మి హైబ్రిడ్ రకం సాగు చేశారని తెలిపారు. జొన్న పంట దవకు రావడంతో రైతుల పిలుపు మేరకు శనివారం స్థానిక వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డితో కలసి పరిశీలించారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలతో యాజమాన్య పద్దతులు పాటించడం వలన పంట పరిపుష్టిగా పండిందన్నారు. అనంతరం కొంగలవీడు రైతు సేవాకేంద్రం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు కొమ్మద్ది రెడ్డి బాషా, రైతులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మించండి

ప్రొద్దుటూరు : శ్రీనివాసనగర్ పరిధిలోని మడూరు కాలువకు రక్షణ గోడ నిర్మించాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రక్షణ గోడ లేని కారణంగా పలు మార్లు పిల్లలు ఆడుకుంటూ కాలువలో పడి ప్రమాదానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. బ్రిలియంట్ స్కూల్ దగ్గర ఉన్న గుంతను వెంటనే పూడ్చాలని కోరారు. ఈ గుంత కారణంగా విద్యార్థులు కిందపడి గాయాలపాలవుతున్నారని తెలిపారు.

తెలుగులో ఉత్తర్వులు వెలువరించడం హర్షణీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులో వెలువరించాలని నిర్ణయించడం హర్షణీయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుభాష ప్రాచీన మైనదని పాశ్చాత్య మోజులోపడి మాతృభాషను మర్చిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భాష సజీవంగా ఉండాలంటే ప్రభుత్వాల చేతిలోనే ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అట్లూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇండియన్ పెట్రోలు బంకు వద్ద శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

నత్తనడకన ఆన్‌లైన్ సేవలు

ప్రొద్దుటూరు : వాహనదారులకు సంబంధించి ఆన్‌లైన్ సేవలు నత్తనడకన నడుస్తున్నాయని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు దూర ప్రాంతాల నుండి ఆర్టీఓ ఆఫీసుకు వస్తున్నారని, కేవైసీ, రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేవలు ప్రజలకు ఆటంకంగా మారాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ సేవలను సత్వరం అయ్యేలా చూడాలని కోరారు.

పర్యావరణాన్ని సంరక్షించాలి

ప్రొద్దుటూరు : పశువైద్య విద్యార్థులు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ కె.శకుంతల తెలిపారు. వికసిత భారత్ 2047 మిషన్‌లో భాగంగా యువ మంథాన్ ఐక్యరాజ్యసమితి కార్యక్రమాన్ని శనివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శకుంతల మాట్లాడుతూ పర్యావరణంపై పడుతున్న దుష్ప్రభావాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆఫీసర్ ఇన్‌చార్జి ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ పి.కళ్యాణి, పరాన్న జీవ శాస్త్ర విభాగ అధిపతి ఆచార్య డాక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు



వ్యాపారులకు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని సూచిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను వ్యాపారులు వినియోగించొద్దని మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఆయన శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న హోటల్‌లో వాడుతున్న ప్లాస్టిక్ కవర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వారితో మాట్లాడుతూ 120 మైక్రాన్లకంటే తక్కువ ఉన్న కవర్లను ప్రభుత్వం నిషేధించిందన్నారు. వీటిని వినియోగిస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

రామేశ్వరం రోడ్డులోని జవహర్ స్కూల్ వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్‌బాషా పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్య మాసం ఆరంభం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, వైకుంఠ ద్వారదర్శనం ఉంటుందన్నారు. 11వ తేదీ శనివారం స్వామివారి మూలవిరాట్‌కు పంచలోహ తొడుగు (కవచం) అమర్చనున్నట్లు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు సకుటుంబ సమేతంగా స్వామివారి కల్యాణంతో పాటు వైకుంఠ ద్వార దర్శనంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

క్రమం తప్పకుండా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలి



కోటవీధిలో క్లోరిన్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : నీటి సరఫరా సిబ్బంది నీటిలో క్లోరిన్ శాతాన్ని గుర్తించేందుకు క్రమం తప్పకుండా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని కోటవీధిలో క్లోరోస్కోప్‌తో క్లోరిన్ టెస్టులు చేయించి అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నీటిసరఫరా చేయు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే క్రమంలో ప్రతి నెల ట్యాంకులను శుభ్రం చేయించడంతో పాటు పైపులైను లీకేజీలు లేకుండా చూసుకోవాలని కోరారు. అలాగే పరీక్షలు నిర్వహించిన అనంతరం ఎప్పటికప్పుడు రికార్డు నమోదు చేయాలని సూచించారు. నీటి సరఫరా సిబ్బంది తమకు కేటాయించిన వార్డుల్లో తిరుగుతూ కొళాయిల దగ్గర, పైపులైను జాయింట్ల దగ్గర లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే నీటివృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ తామంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయిలో ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా మంచి విద్య అందుతుందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించగలరన్నారు.

ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, మండల స్పెషలాఫీసర్ ఆదిశేషారెడ్డి, ఎంపీడీఓ రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సిఎం బాసా, పోరుమామిళ్ల, రంగసముద్రం సర్పంచులు వై. సుధాకర్, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు రమణ, చెంద్రాయుడు, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు, టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, అమీర్‌బాష, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్ కమాల్‌బాష తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి




పోరెడ్డి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పోరెడ్డి నరసింహారెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమించారు. గతంలో ఈయన రాష్ట్ర అదనపు కార్యదర్శిగా పనిచేశారు. తనను నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

రాజుపాళెం : తనపై ఎంతో నమ్మకంతో వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి గుద్దేటి రాజారాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తా



పీవీ రాఘవరెడ్డి

ఖాజీపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి అన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ చాలా మంది నాయకులకు పార్టీ బాధ్యతలు అప్పగించింది. అందులో భాగంగా జనరల్ సెక్రటరీగా పీవీ రాఘవరెడ్డికి పదవి లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను పార్టీ ఉన్నతికి ఉపయోగపడేలా కృషి చేస్తానన్నారు. పీవీ రాఘవరెడ్డిని మండల వైఎస్సార్ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, బి.కొత్తపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు నాగిరెడ్డిలు ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధిగా బోడపాటి



బోడపాటి రామసుబ్బారెడ్డి

బద్వేలు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధులుగా పార్టీ కేంద్ర కార్యాలయం పలువురిని నియమించింది. అందులో భాగంగా బద్వేలు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు బోడపాటి రామసుబ్బారెడ్డిని అధికార ప్రతినిధిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. అధికార ప్రతినిధిగా నియమించడానికి కృషిచేసిన ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కడప జిల్లా జనరల్ సెక్రటరీగా చిత్తా రాజశేఖర్‌రెడ్డి

కలసపాడు : వైఎస్సార్‌సీపీ కడప జిల్లా జనరల్ సెక్రటరీగా కలసపాడు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిత్తా రాజశేఖర్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ప్రకటించారు.